

హార్బర్‌లో జట్టీకి చేరిన బోట్లు

నిజాంపట్నం హార్బర్‌లో.. 3వనెంబర్ ప్రమాదసూచిక

రేపల్లె,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం 3వనెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతోంది. వేటకు వెళ్ళిన బోట్లన్నీ తిరిగి రావాలని వైర్‌లెస్‌సెట్ల ద్వారా అధికారులు ఆదేశాలు జారీచేశారు. సముద్రంలో అలల ఉధృతి అల్లకల్లోలంగా ఉండటంతో వాతావరణంలో చలితో కూడిన ఈదురు గాలులు వీస్తుండడంతో మత్స్యకారులంతా హార్బర్‌కు చేరుకున్నారు. వేటకు వెళ్ళిన బోట్లన్నీ జట్టీలకు పరిమితమయ్యాయి.



అధ్వానంగా ఉన్న గురజాల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం

ఆంధ్రజ్యోతి ఫోకస్

క్రీడల్

విద్యార్థులకు ఆటలు అవసరం.. శారీరక, మానసిక, దేహ దారుఢ్యానికి క్రీడలు దోహద పడతాయి.. అయితే జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేవు. ఆట స్థలాలు ఉన్న దగ్గర్ల పీడీలు లేరు.. పీడీలు ఉన్న కళాశాలలకు మైదానాలు లేవు. ఉన్నా కొన్ని ప్రాంతాల్లో గుంతలు, పిచ్చిచెట్లతో నిండి ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా.. వారిని ప్రోత్సహించే పరిస్థితి లేదు. మొత్తంమీద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ఆర్భాటంగా ప్రకటనలు చేశారే తప్ప అందుకు అనుగుణంగా పరిస్థితులను కల్పించడంలో నాటి పాలకులు విఫలమయ్యారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు చర్యలకు ఉపక్రమించింది. క్రీడా కోటా కింద మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాల దుస్థితి, వసతులపై ఆంధ్రజ్యోతి బృందం ప్రత్యేక కథనం.

- ఆటలు లేని కళాశాలలు
- మైదానాలున్న దగ్గర్ల అధ్వానం
- క్రీడా మైదానాల అభివృద్ధికి చెల్లుచీటి
- కొన్ని కాలేజీల్లో భర్తీ కాని పీడీ పోస్టులు
- క్రీడలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు
- జూనియర్ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరువు
- గత ఐదేళ్లు ఒక్క పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- రేపల్లె కళాశాలలో రెండేళ్లుగా పూర్తికాని ఇండోర్ స్టేడియం
- 3 శాతం స్పోర్ట్స్ కోటా సరే.. సౌకర్యాలు కల్పించాలంటున్న విద్యార్థులు



వినుకొండ జూనియర్ కళాశాల క్రీడామైదానం



మాచర్లలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానం

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21, బాపట్ల జిల్లాలోని చీరాల పరిధిలో నాలుగు వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. అయితే చాలా కళాశాలల్లో క్రీడా మైదానాలే లేవు. అనేక జూనియర్ కళాశాలల్లో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని కళాశాల్లో అయితే ఏళ్ల తరబడి పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సరైన ఆటస్థలం లేదంటే ఇక మండలాల్లోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించిన గత పాలకులు ఆ స్థాయిలో ఆట స్థలాలను ఏర్పాటు చేయలేదు. పీడీ పోస్టుల భర్తీ, ఆటల పరికరాలు, నిధులను మంజూరు చేయలేదు. అంతంతమాత్రం వసతులతోనే చాలా ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు.

ఇక క్రీడ మైదానాలు ఏర్పాటు చేయటం సాధ్యపడే పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ఆటస్థలాలు అధ్వానంగా మారాయి. ఆటల పరికరాలు విద్యార్థులకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు దీంతో ఆసక్తి ఉన్న విద్యార్థులు కూడా ఆటల్లో వెనుకబడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేటుగా శిక్షణ తీసుకోవాలంటే ఖర్చుతో కూడుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి క్రీడలకు అనువైన వాతావరణం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- బాపట్ల సూర్యలంకరోడ్డులో సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను 1972లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రీడా మైదానం లేదు. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాలతో పాటు 2014లో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న స్థలం మొత్తం భవన నిర్మాణాలకు సరిపోయింది. క్రీడలకు స్థలం లేకుండా పోయింది. ఆంజనేయ అగ్రహారం మున్సిపల్ పాఠశాల భవనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను

(మిగతా 7వ పేజీలో)

ఆటలపై అలక్ష్యం..

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా జూనియర్ కళాశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రభుత్వం నిర్వహించలేదు. ఆటలకు అవకాశమే ఇవ్వలేదు. అసలు ఆటల అంశాన్నే వైసీపీ ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికారులు ఆలోచన చేయలేదు. క్రీడా పరికరాల కొనుగోళ్లకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని నాటి పాలకులు ఆర్భాటం చేశారు.. తప్ప కనీసం ఆట స్థలాలను కూడా మెరుగు పరచలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చినా 294 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు.



సత్తెనపల్లిలో రహదారిని తలపిస్తున్న జూనియర్ కాలేజీ క్రీడా మైదానం



పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆటస్థలం

పంటలు వర్షార్పణం



బొల్లాపల్లి : కనమలచెరువులో నీటిలో నానుతున్న వరి ఓదెలు

- తడిసిన ధాన్యం.. నీటిలో వరి ఓదెలు
- నేల కొరిగిన పొగాకు, కంది, మిర్చి పంటలు
- బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండలో భారీ వర్షం

బొల్లాపల్లి, ఈపూరు, నూజెండ్ల, వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉన్నట్లుండి కుండ పోతగా కురిసిన వర్షానికి రైతులు పంటలను కోల్పోయారు. కల్లాల్లో ఆరబోసిన దిగుబడులను రక్షించుకునేందుకు రైతులు తీవ్రప్రయత్నాలు చేసినా వర్షానికి ఆ అవకాశం లేకుండా పోయింది. కోతకోసి పొలంలో ఉన్న వరి ఓదెలు నీటిలో తడిచి పోవడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో వాగుల వెంట కొట్టుకు పోయాయి. వరిపైరు, పొగాకు మొక్కలు వర్షానికి నేలమట్టమయ్యాయి. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో వర్షంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పూతదశలో ఉన్న కంది, మిరప పంటలు వర్షం తాకిడికి నేలకొరగడంతో రైతులు భారీనష్టాలు చవిచూడాల్సి వచ్చింది. పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వినుకొండ మండలం కొత్తపాలెం, నడిగడ్డ, నీలగంగవరం తదితర గ్రామాల పరిధిలోని ధాన్యం వర్షా నికి తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు, కనమలచెరువు, పలుకూరు, రామాపురం, పేరూరుపాడు తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి వరి, మిర్చి, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈపూరు మండలం కొండ్రముట్ల, కొచ్చెర్ల, బోడెపూడి వారిపాలెం, బోడె శంభునివారిపాలెం, ఉప్పరపాలెం గ్రామాల్లో వర్షంతో రైతులు నిలువునా మునిగిపోయారు. నూజెండ్లలో 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.




బొల్లాపల్లి : నీటిలో నానుతున్న ధాన్యం రాసులపై కప్పిన పట్టలు



ఈపూరు: నేలవాలిన పొగాకు పైరు

దిక్సూచి
DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్



- హైదరాబాద్ సర్కిల్: 342
- అమరావతి సర్కిల్: 50
- చివరి తేదీ: 2025 జనవరి 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు.
- పూర్తి వివరాల కోసం: sbi.co.in/web/careers/current-openings వెబ్‌సైట్ చూడవచ్చు.

భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.
హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయిన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్దిత వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్
- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. మెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్దిత సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్దిత సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్టులు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ఠ స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు
- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, పిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్
- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్
- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టీపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్, టాబులర్ డిఐ తదితర డేటా ఇంట్రప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్
- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025

అడ్మిషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ ప్రకటన వెలువడింది. 2025 మే 18న ఎంట్రెన్స్ నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 2న ప్రకటిస్తారు. 2025 ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీల్లో 17,695 బీటెక్, బీఎస్(బ్యాచిలర్ ఆఫ్ సైన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ సంవత్సరం పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

కలికిరి సైనిక్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు

జాబ్ కార్నర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం ఏడు ఉద్యోగాలు ఉన్నాయి. స్కూల్ మెడికల్ ఆఫీసర్-1, పీజీటీ(కంప్యూటర్/ మేథ్స్)-2, టీజీటీ(సోషల్ సైన్స్)-1, పీటీఐ కం మ్యాట్రన్-1, కౌన్సెలర్-1, హార్స్ రైడింగ్ ఇన్‌స్ట్రక్టర్-1 ఖాళీలు ఉన్నాయి. 2025 జనవరి 10వ తేదీలోపు దరఖాస్తు పోస్టులో పంపించాలి. పూర్తి వివరాల కోసం https://sskal.ac.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date: 31-12-2024 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.
Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.
Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.
Last Date to Apply: 15-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా

జగపతి బాబు



సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్' క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్' 'నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు

● అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.



బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.

బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.



వసూళ్లలో కీలక పాత్ర

బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.





భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

కత్తి కంటే కరుణ గొప్పది

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



ప్రార్థన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి

కొల్లిపర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కత్తి కంటే కరుణ.. కక్ష కన్నా క్షమాభిక్ష గొప్పవని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర నూతన యెరూషలేము ప్రార్థన మందిరం సమీపంలో పాస్టర్ ఈమని మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అమెరికాలో తన దగ్గర ఉద్యోగంలో ఉన్న 500 మందిలో 400 మంది క్రిస్టియన్స్ అని తెలిపారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచు కోవాలన్నారు. అనంతరం క్రైస్తవులతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కేక్‌కట్ చేసి అందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచి పిల్లి రాధిక, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధన రెడ్డి, భీమవరపు లంకకోటి రెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, ఉయ్యూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేష్ కుమార్‌కు గోల్డ్ డిస్క్ అవార్డు


గోల్డ్ డిస్క్ అవార్డును అందుకుంటున్న నరేష్‌కుమార్

దుర్గి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులకు చెందిన చిరుమామిళ్ల నరేష్‌కుమార్‌ను గోల్డ్ డిస్క్ అవార్డు వరించింది. దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికుల ప్రాణాలను కాపాడేందుకు చేసిన సేవలకుగానూ నరేష్‌కుమార్‌కు ఈ అవార్డు లభించింది. గత శుక్రవారం చండీగఢ్‌లో అక్కడి డీజీపీ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. సైనికుల్లో శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన పరిశోధనలు చేసి క్షయ రోగుల్లో అనుకూల రోగనిరోధక శక్తిలో లోపాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై నరేష్‌కుమార్ అధ్యయనం చేశారు. ఈయన తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మంగమ్మ వ్యవసాయం కుటుంబానికి చెందిన వారు. నరేష్ కుమార్ ప్రాథమిక విద్యను అడిగొప్పులలో, ఉన్నత విద్యను కారంపూడిలో, ఇంటర్‌ను హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్‌లో 43వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని గాంధీ వైద్యశాలలో 2006లో ఎంబీబీఎస్ సీటు పొందారు. ఎంబీబీఎస్ చివరి సంవత్సరంలో తండ్రి మరణించారు. 2014లో చండీగఢ్‌లో సహాయ కమాండరుగా ఉద్యోగం సాధించారు.

గార్డెన్‌లో గంజాయి మొక్క



మాచర్లటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కను గుట్టుచప్పుడు కాకుండా అటవీ ప్రాంతాల్లో పెంచడం వింటుంటాం. కానీ పట్టణ నడిబొడ్డున అదీ కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి మొక్క పెరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పట్టణంలోని ఆర్‌అండ్‌బి ఆఫీస్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ గార్డెన్‌లో గంజాయి మొక్క పెరుగుతోంది. ఇది ప్రస్తుతం నాలుగు అడుగుల దాకా పెరిగింది. ఇది గుర్తించిన కొందరు విద్యార్థులు గంజాయి మొక్క ఆకులను తెంచుకొని వెళ్తున్నారు. ఈ విషయం కాస్తా బయటకు పొక్కి పోలీసుల దాకా చేరింది. దీంతో పట్టణ పోలీసులు ఆదివారం ఆ గంజాయి మొక్కను తొలగించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మండలిలో ఆలపాటి సేవలు అవసరం

● ఆయన్ని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ప్రజా ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపిస్తే ప్రభుత్వానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల మధ్య వారధిగా పనిచేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్‌లో ఆదివారం, గుంటూరు-కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అధ్యక్షత వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కూటమి ఒప్పందానికి అంగీకరించి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తెనాలిలో 55 వేల మెజారిటీ తీసుకువచ్చేలా ఆలపాటి రాజా కష్టపడ్డారని గుర్తుచేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు తిరుగులేని మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని సూచించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాసన మండలి క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆలపాటిని గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఐక్యంగా పోటీచేస్తే వచ్చే ఫలితాలు శాసనసభ ఎన్నికలు రుజువు చేశాయని అన్నారు. ఓట్లు చీలకుండా, నాయకులను సమన్వయం చేసుకుని ఆలపాటి గెలుపునకు కృషి చేయాలన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఓటమిని ముందుగానే జగన్ ఊహించి పోటీ నుంచి తప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. ఇదే కొనసాగితే 2029లో జరిగే శాసనసభ ఎన్నికల ముందే జగన్ తప్పుకుంటాడని విమర్శించారు. దాదాపు ఆలపాటి గెలుపు నిర్ణయమైందని, కాకపోతే అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ అభ్యర్థిగా ఎంపిక చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహమద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, చిరంజీవిరావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యరావు, అబద్దయ్య, మంజులా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, ఏఎస్ రామకృష్ణ, కూటమి నాయకులు గాదె వెంకటేశ్వరరావు, మాగంటి సుధాకర్, ఉపాధ్యాయుల సంఘ నాయకులు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన పట్టభద్రులు పాల్గొన్నారు.

జీవాలపైకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

● 147 మృతి.. కాళ్లు విరిగిన మరో 50 జీవాలు
● సుమారుగా రూ. 50 లక్షల నష్టం


పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా ప్రయాణం చేస్తున్న ట్రావెల్స్ బస్సు మేత కోసం తోలుకొని వెళ్తున్న జీవాల గుంపును తొక్కుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో 147 జీవాలు మృతి చెందగా, మరో 50 జీవాల కాళ్లు విరిగి, తలలు పగిలి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి అయిన అలంకార్ థియేటర్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం 5.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ గ్రామానికి చెందిన ఆవుల మల్లేష్, కర్రెన్నలకు చెందిన గొర్రెల మంద గురజాల మండలం పులిపాడు గ్రామంలో గత వారం రోజులుగా ఉన్నాయి. అక్కడి నుంచి దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి జీవాల మేతకై తోలుకొని వెళ్తున్నారు. ఈ మందలో 600 వరకు జీవాలు ఉన్నాయి. రాష్ట్ర రహదారి రోడ్డెక్కి దాచేపల్లిలోని అలంకార్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి జీవాల మంద చేరుకున్నాయి. ఈలోగా హైదరాబాద్ నుంచి ఇంకొల్లుకు ప్రయాణం చేస్తున్న మారుతి ట్రావెల్స్ బస్సు అతివేగంగా వస్తూ నేరుగా జీవాల గుంపుపైకి తొక్కుకుంటూ ముందుకెళ్లింది. బస్సు ముందు టైర్ కింద సుమారు 30 నుంచి 40 దాకా గొర్రెలు ఉండచుట్టుకొని టైర్‌కు అడ్డుపడటంతో ముందుకు కదలలేని స్థితిలో బస్సు ఆగిపోయింది. ఈలోగా బస్సు డ్రైవర్‌ను హెచ్చరించేందుకు కేకలు పెడుతూ వెళ్లిన ఆవుల మల్లేష్, కర్రెన్నలను కూడా బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గామాలపాడు గ్రామ సర్పంచి జంగా సురేష్ నాయకత్వంలో రోడ్డుపై బైఠాయించారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం..

టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. వారికి న్యాయం జరిగే వరకూ అన్నివిధాల అండగా ఉంటామని, జరిగిన నష్టంపై పల్నాడు జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ బస్సు యజమాని నుంచి యాదవ సోదరులకు నష్టపరిహారం ఇప్పించే చర్యలు తీసుకుంటాం అని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి గాయపడిన కాపరులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగమే ప్రమాదానికి కారణమని అన్నారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్‌ఐ సౌందర్‌రాజన్ సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు సంఘటనా స్థలంలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. గురజాల డీఎస్పీ జగదీష్ తదితరులు సంఘటనా స్థలంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆగ్రహంతో ఉన్న యాదవలను సమాధానపరిచి రాస్తారోకోను విరమింపజేశారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అడిషనల్ ఎస్పీ ఏవీ సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు, గురజాల సీఐ ఆవుల భాస్కర్ సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు.

కళ్లెదుటే జీవనం కుప్పకూలింది

దాచేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కళ్లముందే తనవాళ్లు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. అప్పటి వరకు తను అదిరించి బెదిరించి తోలుతున్న జీవాలు బస్సు టైర్ల కిందపడి ప్రాణాలు కోల్పోయాయి. తన పక్కన తోడు ఎవరూ లేరు. అయినా శ్రీకాంత్ ధైర్యంతో పోలీసులకు, స్థానికులకు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయులకు సమాధానం చెప్పాడు. గొర్రెల మంద యజమాని కుమారుడైన బాలుడు శ్రీకాంత్ సంఘటనా స్థలంలోనే నదురు బెదురు లేకుండా నిల్చొని ఉన్నాడు. పోలీసు ఉన్నతాధికారులతో పాటు టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, గామాలపాడు సర్పంచి జంగా సురేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ప్రత్యక్ష సాక్షిగా ఉన్న శ్రీకాంత్‌ను వివరాలు అడిగారు. శ్రీకాంత్ ఏమాత్రం అధైర్యపడకుండా అందరికీ తనకు తెలిసిన సమాచారాన్ని వివరించాడు.

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నా పీడీ పోస్టు లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులకు పీడీ ఉన్నా ఆట స్థలం లేదు. ప్రాంగణంలో టైల్స్ వేయడంతో దానిపై ఇసుక పోసి మొక్కుబడిగా ఆటలు ఆడిస్తున్నారు.

● చీరాల నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఆయా కళాశాలల్లో ఆటస్థలాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ విద్యార్థులకు ఆటలకు అవకాశం లేకుండా పోయింది.

● వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979-80లో ప్రారంభించగా అప్పటి నుంచి పీడీ పోస్టు లేదు. దీంతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నా ఆటలు ఆడించే వారు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. పీడీ పోస్టు లేకపోవడంతో క్రీడలకు చెందిన ఎలాంటి వస్తువులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడంలేదు.

● రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడేళ్ల క్రితం పీడీ ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలో పెద్ద క్రీడా మైదానం ఉన్నా 150 మంది విద్యార్థులకు క్రీడలు నేర్పించే పరిస్థితి లేదు. కనీసం ఆటలు ఆడుకునే పరికరాలు కూడా లేవు. కళాశాల ప్రాంగణంలో 2022లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాన చేయగా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. బేస్‌మెంట్, చుట్టూ ఐరన్ పిల్లర్స్ పైన కప్పు వేశారే తప్ప కింద భాగంలో కాంక్రీట్ వేయలేదు. ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీటి పైప్‌లైన్లు వెయ్యాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులను నిలిపివేశారు.

● మాచర్లలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం ఉండగా ఆట పరికరాలు, పీడీ లేరు. దుర్గిలోని జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం లేదు. పీడీ లేరు.

క్రీడల్


● వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదేళ్ల నుంచి పీడీ పోస్టు భర్తీకి నోచుకోలేదు. విశాలమైన గ్రౌండ్ ఉంది. దీంతో కళాశాలలోని 450 మంది విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపలేకపోతున్నారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం సక్రమంగా లేదు. ఒకే ఒక పీఈటీ ఉన్నారు. దీంతో విద్యార్థులకు క్రీడా అవకాశాలు కోల్పోతున్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్‌పై పీఈటీ ఉన్నా ఆట స్థలాలు లేవు.

● సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం అధ్వానంగా ఉంది. పిచ్చిచెట్లు, గుంతలతో నిండి ఉన్న మైదానంలో విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. పీడీ పోస్టు ఉన్నా అవసరమైన క్రీడా పరికరాలు లేవు. మైదానం అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్, పీడీలు ఇటీవల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

● పిడుగురాళ్ల, గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దాచేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం లేదు. పీడీ పోస్టు ఖాళీగా ఉంది. క్రీడా పరికరాలు ఉన్నా వినియోగించే వీలులేక బీరువాలో ఉన్నాయి.

● పొన్నూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలతో పాటు పీడీ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలేదు. వెల్లలూరులోని జూనియర్ కళాశాలలో క్రీడలకు అవసరమైన ప్రాంగణం లేదు. పీడీ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కళాశాల విద్యార్థులకు అదే ప్రాంగణంలోని హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు క్రీడల శిక్షణ ఇస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

ఉరకలెత్తిన ఉత్సాహం


యువజనోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటీ 2024-25 వేడుకలు ఘనంగా ఆదివారం ముగిశాయి. రెండో రోజు యువజనోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. ఆట, పాటలతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. సాహితీ ప్రహేళిక, ఆధునిక అష్టావధానం, జానపద, శాస్త్రీయ నృత్యం, సంగీతం, సాంస్కృతిక అంశాలతోపాటుగా కోడ్ రివైంట్, ట్రెజర్ హంట్, మ్యాట్రిక్ మిస్టరీ, క్యాడ్ కాంటెస్ట్, బ్రెయిన్లీ బవుంట్ వంటి సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాషామాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెక్రటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. యువజనోత్సవం పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ యువజనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96,104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

బధిరరహిత స్వర్ణాంధ్ర సాధనకు కృషి


శిబిరంలో భాష్యం రామకృష్ణ, డాక్టర్ సుబ్బారాయుడు

గుంటూరు మెడికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన బధిరరహిత స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం గుంటూరువారితోట మూడో లైన్‌లోని రాధికా రాయుడు హాస్పిటల్‌లో ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినికిడిలోపం గల పిల్లలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వినికిడిలోపం గల చిన్నారులకు ఉచితంగా కాక్లియార్ ఆపరేషన్లు చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తామని భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఉచితంగా కాక్లియార్ సర్జరీలు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక వయసు పరిమితి దాటిన తర్వాత పిల్లలను తీసుకురావడం వల్ల ఉచిత ఆపరేషన్లు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన శిబిరంలో 100 మంది పిల్లలకు వినికిడి లోపం పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ పాములపాటి రాధికా రాణి తెలిపారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గొంది శివరామకృష్ణ, దంత వైద్యనిపుణులు సాయిశంకర్, డాక్టర్ దినేష్, ఆడియాలజిస్ట్ టి.నరేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తాం


చెరుకూరి సుభాష్ చంద్రబోస్‌కి సత్కారం

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తామని చెరుకూరి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఆదివారం పెదకాకానిలో చెరుకూరి వారి 5వ ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షులు చెరుకూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అనంతపురంకు చెందిన ఇంటర్ విద్యార్థికి రూ.65 వేలు చదువు నిమిత్తం సహాయం అందించామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ చదువుకున్న వారికి తమ సంస్థలో ఉద్యోగ కల్పన చేస్తామని ప్రకటించారు. 500 మందికిపైగా చెరుకూరి వంశస్తులు, శ్రీబిల్డర్స్ అధినేత సతీష్ బాబు, చెరుకూరి లెనిన్, ఆర్వీరీ అకాడమీ అధినేత సత్యనారాయణ, సీతారామయ్య జగదీష్ చంద్రశేఖర్ హాజరయ్యారు.

భారీ స్కోరు దిశగా ఉత్తరాఖండ్


మయాంక్(104 నాటౌట్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 288 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు మయాంక్ ముదిల 132 బంతుల్లో 104, అనయ నేగి 230 బంతుల్లో 90, ఆదిత్య 124 బంతుల్లో 61 పరుగులు చేశారు. కర్ణాటక బౌలర్లు కె.గగన్ సాయి, జి.వెంకటేష్, కె.ప్రీతమ్ రాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

వర్సిటీ ఖోఖో జట్టుకు 15 మంది ఎంపిక


విజేతలకు కప్ అందజేస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

గుంటూరు(విద్య), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీజేపీఎస్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల ఖోఖో (పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విక్టరి డిగ్రీ (నరసరావుపేట) కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీం ఎంపికలు జరిగాయి. యూనివర్సిటీ ఖోఖో జట్టులో విక్టరి డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు, డీసీఆర్‌ఎం కళాశాల నుంచి నలుగురు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల నుంచి ఒకరు, యూనివర్సిటీ వ్యాయామ కళాశాల నుంచి ఒకరు, జేకేసీ కళాశాల నుంచి ఒకరు, ధనలక్ష్మి వ్యాయామ కళాశాల నుంచి ఒకరు మొత్తం 15 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 40.42 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ఆయన తెలిపారు.



● మధ్యప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత డీజీపీ (డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) బండి మరియకుమార్ సోమవారం రెంటచింతలకు రానున్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో చదివిన ఆయన రచించిన 'బాల్యం నాటి బంగారు రోజులు' అనే పుస్తకాన్ని విశ్రాంత శాస్త్రవేత్త మందపాటి మోహన్ ఆవిష్కరించనున్నారు. అలాగే మరియకుమార్ పాఠశాలలో నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకల్లోనూ పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య తెలిపారు.

● కన్నెగంటి భార్గవనాయుడు జ్ఞాపకార్థం జనవరి 3న పిడుగురాళ్లలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎంట్రీలను ఈనెల 25 లోపు నిర్వాహకులకు తెలియజేయాలని, వివరాలకు సెల్:95023 00411, 8522999880 నెంబర్లను సంప్రదించాలని కమిటీ సభ్యులు సూచించారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 576.90 అడుగులు ఉంది. ఇది 274.09 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 18,866 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 18,866 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

జూదరుల అరెస్టు

మాచర్ల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్‌లోని శివగణేష్ హోటల్ సమీపంలో పేకాటస్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ షఫి తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ. 3580 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ల టైర్లు చోరీ

రెంటచింతల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయి జంక్షన్‌లో నిలిపి ఉంచిన ట్రాక్టర్ల టైర్లు చోరీకి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలు దమ్ము చక్రాల ట్రాక్టర్ల రెంటచింతలకు వచ్చాయి. ఈ క్రమంలో రెండు టైర్లను తీసి వీల్స్ చక్రాలతో సమీపంలోని పొలంలో దమ్ము చేసే పనికి వెళ్లారు. అనంతరం వచ్చి చూడగా ఆ ప్రదేశంలో టైర్లు లేవని బాధితుడు పడవాల పుల్లయ్య వాపోయాడు. వీటి విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు.

హెల్మెట్ ధరించాలి

మాచర్లటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్ఐ నరసింహ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించారు. ట్రిపుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలను నడపవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరసింహ హెచ్చరించారు.

సాగరమాత ఆలయంలో

ప్రత్యేక ప్రార్ధనలు

మాచర్ల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశమందించారు. దివ్యబలిపూజ నిర్వహించి తేరు ప్రదిక్షణ జరిపారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

వెల్దుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడు ముదిరాజ్ బజారలో రూ. 16 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కుర్రి శివారెడ్డి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పేదల మనిషి పెదరామయ్య

● నేడు పెదకర్మ.. హాజరుకానున్న నేతలు

దుర్గి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల మనిషిగా పేరొందిన యాగంటి పెదరామయ్య పెదకర్మను సోమవారం మండల కేంద్రమైన దుర్గిలోని ఆయన స్వగృహంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానాయుడుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ

పనులను ప్రారంభం

కారంపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదిరాజ్ బజారులో రూ. 10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, ఎస్‌పీఆర్ కృష్ణ, కాసుల శంకర్, కర్నాటి మహేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆసరా సీఎం రిలీఫ్ ఫండ్

● వైద్యం కోసం డబ్బు లేక ఏ ఒక్క ప్రాణం పోకూడదు : ఎమ్మెల్యే జూలకంటి
● 22 మంది లబ్ధిదారులకు రూ.37.51 లక్షల చెక్కుల అందజేత



పాలువాయిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య శస్త్రచికిత్స అవసరమైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరగా నిలస్తోందని, ఈ పథకం ఆయా రోగులకు ఓ వరమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అన్నారు. ఆదివారం రెంటచింతల మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో 22 మందికి రూ.37 లక్షల 51 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. వారిలో పాలువాయి గ్రామానికి చెందిన పొట్టిపోగు రాజేష్, పొట్టిపోగు సైదులు, పాలువాయిగేట్ గ్రామానికి చెందిన బెల్లంకొండ శారదలకు రూ.3.60 లక్షలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు నిరుపేదల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను రూపకల్పన చేస్తున్నారన్నారు. ఏ పేదవాడు డబ్బు లేక వైద్యం అందక ప్రాణాలిడవ సాధ్యమైనంత వరకు అవసరమైన ప్రతి రోగికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌ని అందజేస్తుందన్నారు. ఈ ఆరు నెలల కాలంలో నియోజక వర్గం పరిధిలో 120 మందికి రూ.1.62 కోట్ల విలువ చేసే వైద్యాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందచేశామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో స్పీడ్ పెంచాలి

టీడీపీ సభ్యత్వ నమోదును స్పీడ్ పెంచాలని పశర్లపాడు గ్రామం ముందంజలో వుండగా మరో నాలుగు గ్రామాల్లో వేగాన్ని పెంచాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ నేతలకు సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెంటచింతల మండలం నుంచి టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిన సంగతిని గుర్తు చేస్తూ పార్టీ కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, రామకృష్ణలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సూచించారు.

కల్యాణమండపం ప్రారంభోత్సవంలో..

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్లలో చప్పిడి సురేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చప్పిడి వెంకయ్య నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ముందుగా చప్పిడి వెంకయ్య విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మాజీ ఎంపీపీ చావా వీరాజనేయులు, గాడిపర్తి పూర్ణయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, చప్పిడి రాము, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేత



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజక వర్గంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని విద్యా కేంద్రం కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగాజాబ్ మేళాను ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో రెండవ దఫా మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. ఈజాబ్‌మేళాలో 33 కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇక మీదటా మరిన్ని జాబ్‌మేళాలను నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఎమ్మెల్యే కన్నా హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేయూత నిస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన 1500 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరయ్యారు. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి ఎమ్మెల్యే కన్నా నియామక పత్రాలను అందజేశారు. జాబ్‌మేళాకు సహకరించిన కంపెనీల నిర్వాహకులకు కన్నా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, గోగినేని కోటేశ్వరరావు, స్థానిక నాయకులు జాను బాబు, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, కట్టా రమేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

దుర్గి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు జరిపారు. ఈ పోటీల్లో దుర్గి మండలానికి చెందిన పి చంద్రిక (ప్రభుత్వ జూనియర్ కళాశాల) ప్రథమం, పి హేమ (కేజీబీవీ) ద్వితీయం, బి మేఘన (ఏపీ మోడల్ స్కూల్) తృతీయం సాధించారు. ఈ విద్యార్థులను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అభినందించి బహుమతులు అందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్‌వీఎస్ ప్రసాద్, ఆకుల ఆశాజ్యోతి తదితరులు అభినందించారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

● ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు బీ అరుణ

సత్తెనపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతాకాలంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, గుండె, మధుమేహం, రక్తపోటు ఉన్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు బీ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం వేళ ఎండలో ఉండాలని, గదుల్లో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలని, ఉన్ని దుస్తులతో పాటు ముఖానికి చలిగాలి తగలకుండా చూసుకోవాలని ఆమె గర్భిణీలకు సూచించారు. బాలింతలు ఇదే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకవిలువలున్న ఆహారం తీసుకోవాలని, అవివేడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కాన్పు తర్వాత కనీసం ఐదు నెలల పాటు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తెలియ జేశారు.

సేవకు ప్రతి రూపం ఆర్యవైశ్యులు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సేవకు ప్రతిరూపం ఆర్యవైశ్యులని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని గోశాలలో ఆదివారం మూడు ఆర్యవైశ్యసంఘాల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడిగా బచ్చు వెంకటేశ్వర్లు, గోశాల అధ్యక్షుడిగా పెండాల కాశీ మల్లేశ్వరరావు, పట్టణ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడిగా అన్నం బాలసుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య యువజనసంఘం అధ్యక్షుడిగా చిలంచర్ల కళ్యాణ్ ఎన్నికకాగా ఆయా కార్యవర్గాలతో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఎం సాత్విక్ రాము, వెంకట్, కొత్త రామకృష్ణ, జువ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, పెరుమాళ్ళ శంకర్, కందకట్ల శంకర్ పాల్గొన్నారు.

26న సీపీఐ శతజయంతి ఉత్సవం

కారంపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ సైదా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఏర్పడిన పార్టీ సీపీఐ అన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సూరె హనుమంతురావు, మేకపోతు చిన కోటిరెడ్డి, ఇందూరు శ్రీనివాసరావు, ఏకే నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పూదోట రాయన్నకు

టీడీపీ శాశ్వత సభ్యత్వం

పెదకూరపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరుకు చెందిన టీడీపీ నేత పూదోటరాయన్న ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్‌కు లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, బుచ్చయ్య పాలెం మాజీ సర్పంచ్ క్రాపా వీరసింహం, టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



పాకాలపాడులో నిర్మిస్తున్న సైడు డ్రెయిన్

పల్లెకు పండుగ వచ్చే..

● ఉపాధి నిధులతో వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు
● సంక్రాంతికి నూరుశాతం పనుల పూర్తి ..
● పంచాయతీ రాజ్ డీఈ శేఖర్‌బాబు వెల్లడి

సత్తెనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పల్లెకు పండుగ వచ్చింది. సత్తెనపల్లి నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి ఉత్సవం నడుస్తుంది. ఎప్పటి నుంచో ఆగిపోయిన నిర్మాణ పనులు మొదలు కావటంతో ప్రజలు కూటమి ప్రభుత్వం పాలనా దక్షతను ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఉపాధి హామి పథకం నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సంక్రాంతిలోపు నూరుశాతంగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా అధికారులు పనులు చేయిస్తున్నారు.

సత్తెనపల్లి మండలంలో 32 పనులు రూ 2.45 కోట్లతో, ముప్పాళ్ళ మండలంలో 14 పనులు రూ 1.68 కోట్లతో, రాజుపాలెం మండలంలో 19 పనులు రూ 2.07 కోట్లతో, నకరికల్లు మండలంలో 18 పనులు రూ 2.78 కోట్లతో జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామి పథకం మెటీరియల్ కోటా నిధులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రధానంగా గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్‌లు వంటి నిర్మాణ పనులు చేపట్టింది. మొత్తం నియోజక వర్గంలో 83 పనులు రూ 8.95 కోట్లతో జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి నిర్మాణాలు పూర్తిచేసుకొని ప్రారంభ మవుతాయని పంచాయతీ రాజ్ డీఈ శేఖర్ బాబు తెలిపారు.

సందేశాత్మకంగా సెమీక్రిస్మస్ వేడుకలు

● పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటుకూరు గ్రామంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నేతలతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. మత పెద్దల నుంచి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ, శాంతి ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. ఏసు చూపిన మార్గంలో పయనించి సత్ ప్రవర్తన అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ డీ.సాంబశివరావు, టీడీపీ నేతలు పోలేపల్లి రోశయ్య, షేక్ సలాం, జనసేన నాయకులు శాఖమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



క్రోసూరులో క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

టీడీపీ ఆధ్వర్యంలో క్రోసూరు ఏఈఎల్‌సీ చర్చిలో..

టీడీపీ ఆధ్వర్యంలో క్రోసూరు ఏఈఎల్‌సీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాంద్రు కాశయ్య క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ మాచర్ల సుందరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి టీడీపీ నేతలకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, బండారు మైసూర్ బాబు, చెరువు నీటి సంఘం అధ్యక్షులు పరిశ రాంబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు జిజ్జారి వెంకటరావు, అనుమాల పూర్ణ, దుద్దుల యోహాన్, మన్నెం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి,(ఆంధ్రజ్యోతి): నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో నిర్వహించిన సెమీక్రిస్మస్ కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. అనంతరం సీపీఐ కల్యాణ మండపంలో జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కూటమి నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పాముల కిషోర్, అధ్యాపకులు బుల్లయ్య, తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



పాస్టర్లకు వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పాస్టర్లకు నూతన వస్త్రాలు..

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్లలో గల చప్పిడి వెంకయ్య కళ్యాణ మండపంలో ఆదివారం మండల పరిధిలోని పాస్టర్లకు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నూతన వస్త్రాలను అందించారు. అనంతరం పాస్టర్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి శ్రీనివాసరావు, బూసా రామాంజినేయులు, తోడేటి రాజేశ్వరి, వెంకయ్య, నాగులునాయక్, గాడిపర్తి పూర్ణయ్య, చావా వీరాంజనేయులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ గుర్తింపు

డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి
రెంటచింతల పీహెచ్‌సీ వైద్యాధికారి

ఫటా ఫట్





రెంటచింతల,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ వ్యాధిని గుర్తించవచ్చని, తొలి దశలో చికిత్స అందిస్తే వ్యాధి నివారణ సాధ్యమేనని రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వీ.ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి శుక్రవారం ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్రశ్న : పీహెచ్‌సీలో ఎంత ఓపీ వుంటుంది?

జవాబు : ప్రతి రోజు ఓపీ సుమారు 100కు మించి వుంటుంది. ఎక్కువగా సాధారణ జ్వరాలు, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు వంటి సమస్యలతో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. వారిని పరీక్షించి మందులు అందజేస్తున్నాం.

ప్రశ్న : కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా?

జవాబు : కుక్క కాటుకు యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్ ఇస్తున్నాం. డిసెంబరులో 48 కేసులు వచ్చాయి. కుక్కలసంతానోత్పత్తి నివారణకు ఆయా గ్రామ పంచాయతీలు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ప్రశ్న : ఆస్పత్రిలో ఎన్ని బెడ్లు వున్నాయి? ఇప్పటి వరకు ఎన్ని కాన్పులు జరిగాయి?

జవాబు : పీహెచ్‌సీలో ఆరు బెడ్లు వున్నాయి. ఇంకా గోలి గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టకపోవడం వలన ఈ పీహెచ్‌సీపై పని భారం పెరిగింది. ఈ పీహెచ్‌సీలో ఇప్పటి వరకు ఆరు కాన్పులను సురక్షితంగా చేశాము. ఆయా కాన్పుల్లో తల్లిబిడ్డ క్షేమంగానే ఉన్నారు.

ప్రశ్న : సంచార చికిత్స పథకం కొనసాగుతుందా?

జవాబు : 104 ద్వారా సంచార చికిత్స అందిస్తూనే ఉన్నాం. మండలంలో 11 గ్రామాలుండగా 13 సచివాలయాలున్నాయి. వాటి పరిధిలో సంచార చికిత్స పథకంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ చికిత్సలను అందిస్తున్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదకూరపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు క్యాంపు కార్యాలయంలో ఆదివారం పెదకూరపాడు, అమరావతి మండలాలకు చెందిన ఎనిమిది మందికి రూ 6,77,744 చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. అర్హులైన వారికి చెక్కులను పంపిణీ చేయటంతో పాటు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని పొందిన పేదలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగకూ పస్తులేనా..

● ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల ఆవేదన
● మూడు నెలలుగా జీతాలు అందక అవస్థలు

సత్తెనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. క్రిస్మస్ పండుగకు తాము పస్తులు ఉండాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏరియా వైద్యశాలలో 13 మంది వరకు పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ 11,858 జీతంగా చెల్లిస్తారు. వీరికి సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించిన జీతాలు నేటికి చెల్లించ లేదు. డిసెంబరు నెల కూడా పూర్తి కావస్తుంది. అసలే వీరంతా నిరు పేదలు. నెలనెల జీతాల మీద ఆధార పడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. మూడు నెలల జీతాలు రాక పోవటంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించు కోవాల్సి వస్తుంది. సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఈ విషయం పై దృష్టి సారించి వీరికి రావాల్సిన జీతాలను ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్టీయూ నేతలు జోసఫ్ సుధీర్, సంఘు నేతలు

ఉపకారవేతనాల కోసం విద్యార్థులకు పరీక్ష

పిడుగురాళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెనిన్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో దొప్పలపూడి దేవరత్నం మెమోరియల్ స్కాలర్‌షిప్ జిల్లా స్థాయి టెస్టును ఆదివారం నిర్వహించారు. సుమారు 50 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ పరీక్షకు హాజరైన వారిలో బ్రాహ్మణపల్లిలోని జడ్పీ పాఠశాలకు చెందిన కే. హేమంత్ మొదటి బహుమతి, ఒప్పిచర్ల జడ్పీ పాఠశాలకు చెందిన ఏ పావనిచంద్రిక ద్వితీయ బహుమతి, బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన పీ హర్షవర్ధన్‌రెడ్డి తృతీయ బహుమతి సాధించారు. పాఠశాల హెచ్‌ఎం ఎన్ నాగేశ్వరరావు విద్యార్థులకు సంబంధించి పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు, స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడుజిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ఐవీ మోహన్‌రెడ్డి, డీ అప్పిరెడ్డి, ఎం గఫూర్, యూ. చంద్రజిత్ యాదవ్, ఏడుకొండలు, స్వామి, రామలింగయ్య, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జునరావు, పుల్లారావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు..

దాచేపల్లి, గురజాల టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన సమాచారం ప్రకారం.. గురజాల పట్టణానికి చెందిన అమ్మోరయ్య, రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన రామారావులు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఓ ద్విచక్ర వాహనంపై వస్తుండగా, నడికుడి పెట్రోల్ బంక్ సమీపంలో మిర్చిలోడుతో వస్తున్న లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమ్మోరయ్య, రామారావు లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యసేవల నిమిత్తం అక్కడి నుంచి వారిని నరసరావుపేట ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అమ్మోరయ్య (45) మరణించినట్లు ధ్రువీకరించారు. రామారావుకి వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అర్హులైన ప్రతి పేద వారికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆరుగురికి ఆరు లక్షలు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమంతోపాటు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిస్సహాయకులకు అండగా నిలవడం ఎంతో సంతోషం, సంతృప్తి నిస్తుందని తెలిపారు.



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు: ఒకరు మృతి

వినుకొండ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేగంగా ప్రయాణిస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మార్కాపురంరోడ్డులోని పసుపులేరు బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వినుకొండ నుంచి నడిగడ్డ వైపుగా వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వాహనంపై ప్రయాణిస్తున్న ప్రతాపుల గురవయ్య (59) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలతో ఉన్న భీమరాజును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కత్తి స్వర్ణలత సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బొల్లాపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో ఆదివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గంజన బోయిన గోపాల్ ఇంట్లోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాల్ పొలం వెళ్లి సమయంలో అగ్నిప్రమాదం జరగటంతో చుట్టుపక్కల వారు చూసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లోకి వెళ్ళి చూడగా ఇంట్లోని సామగ్రి, నగదు, బంగారం, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి విగ్రహం

రొంపిచర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో ఆదివారం పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 20వ తేదీ నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పోలేరమ్మతల్లి విగ్రహంతో పాటు పోతురాజు, ఆలయ శిఖరప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

25న చిలకలూరిపేటలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

చిలకలూరిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా స్థానిక నరసరావుపేట సెంటర్‌లో ఈ నెల 25న వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శకుంతల ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ విభాగం ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వాజ్‌పేయి విగ్రహంను ఆవిష్కరింస్తారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు ఆర్ గోపి శ్రీనివాస్ పాల్గొంటారని వివరించారు.

భూ ఆక్రమణలకు పాల్పడిన వైసీపీ నేతలు: ఆయూబ్‌ఖాన్

వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి, మద్యం మాఫియాలతో భూ ఆక్రమణలు చేసింది వైసీపీ నాయకులు కాదా అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వ హయాంలో పోలీస్‌స్టేషన్‌లో రౌడీలు, మర్డర్ కేసులో ఉన్న వారు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. గతంలో యువత చెడు వ్యసనాలకు పాల్పడ్డారని, నేడు జీవీ హయాంలో యువత ఉద్యోగాలు వైపు పయనిస్తున్నారని అన్నారు. బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ లెనిన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ న్యాయవాది మార్కాపురం రోడ్డులో అక్రమాలకు పాల్పడడం నిజం కాదా అని ప్రశ్నించారు. వినుకొండ నియోజకవర్గంలో వైసీపీ హయాంలో చేసిన ల్యాండ్ మాఫియా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. కారంపూడి రోడ్డులో దాదా కుటుంబంపై అక్రమ కేసులు బనాయించి భూములను ఆక్రమించుకుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీనురాయల్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో చేసిన అక్రమాలకు, ఆరు నెలల కాలంలో ఎన్డీఏ పాలనలో చేసిన మంచి పనులపై వీడియో ఫుటేజ్ ద్వారా చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ ద్వారా ఐదుగురు సభ్యులను పోటీకి దింపితే సాక్షాత్తు అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనకు వీడియోకాల్ చేసి బెదిరించింది వాస్తవం కాదా అన్నారు.


బొల్లాపల్లి వద్ద వాగులో కొట్టుకు వచ్చిన వరి ఓదెలు



బొల్లాపల్లి: ధాన్యపు బస్తాల చుట్టూ చేరిన వర్షపు నీరు, వర్షానికి నేలకొరిగిన పొగాకు మొక్కలు

భారీ వర్షం.. పంట నష్టం

● అకాల వర్షంతో అన్నదాతల్లో ఆవేదన ● నీళ్లలో నానుతున్న ఓదెలు


ఈపూరు వద్ద నీటమునిగిన వరి పంట


వెల్లటూరులో తడిచిన వరి ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు


కొండ్రముట్ల వద్ద వర్షపునీటిలో తేలియాడుతున్న వరి ఓదెలు

వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం, నడిగడ్డ, నీలగంగవరం తదితర గ్రామాల్లోని పొలాల్లో కురిసిన అకాల వర్షానికి పంటలు నేలకొరిగాయి. కల్లాల్లో ఉన్న వరి ధాన్యపు గింజలు వర్షానికి తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం శ్రమించి కాయకష్టంతో పండించిన పొగాకు, వరి పొలాలు అక్కడక్కడ నీటమునిగాయి. ఆదివారం తెల్లవారుజామున అమాంతంగా వర్షం కురవడంతో పంటలన్నీ దెబ్బతినడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా పూతదశలో ఉన్న కంది, మిరప పంటలు వర్షం తాకిడికి నేలకొరగడంతో రైతులు భారీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. జిల్లా అధికారులు స్పందించి తడిచిన పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి అంజిరెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే రైతు పండించిన వరి పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

● నూజెండ్ల: బంగాళాఖాతంలో అల్ప పీడన ప్రభావంతో ఆదివారం ఉదయం కురిసిన వర్షాలతో రైతుల గుండెల్లో భయం మొదలైంది. పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడటంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది. ముఖ్యంగా కోతలకు సిద్ధమైన వరి పైరు పడిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. పొగాకు పందిళ్ళు వర్షానికి తడవటంతో రైతులు నష్టపోయే పరిస్థితి. ఈ సమయంలో పడే వర్షాలు రైతులకు కష్టాలను, నష్టాలను తీసుకువచ్చే విధంగా మారతాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో శనివారం ఉదయానికి 5.8 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైంది.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో శనివారం అర్ధరాత్రి బొల్లాపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వెల్లటూరు, కనమలచెరువు, పలుకూరు, రామాపురం, పేరూరుపాడు తదితర గ్రామాల్లో వరి, మిర్చి, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఆయా రైతులు వర్షం దాటికి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాల్లో కోసిన వరి ఓదెలు నీటిలో నానున్నాయి. కొంత వరి ఓదెలు వర్షం ధాటికి కొట్టుకుపోయాయి. నీటిలో నానుతున్న వరి ఓదెలను రైతులు తిరిగి ఆర బెట్టుకుంటున్నారు. పొలాల్లో ఉన్న వరి ధాన్యపు రాసులు వర్షానికి తడిచాయి. బస్తాలలోని వరి ధాన్యం కూడా అకాల వర్షంతో తడిచిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి కూడా తడిచిపోయింది. పొగాకు పంట వర్షం ధాటికి నేల వాలింది. కల్లాల్లో ఆర బోసిన మిర్చి అర్ధ రాత్రి వర్షం రావటంతో పూర్తిగా తడిచి పోయింది. వరి కల్లాలు చేసి చేతికి ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ కుండపోతగా కురిసిన వర్షానికి తడిచిపోయింది. చివరికి ఒక చోట పోసి పట్టలు కప్పిన వరి ధాన్యపు రాసులు కూడా వర్షం నీటిలో మునిగాయి. తాము అధికంగా పెట్టుబడులు పెట్టి పంటలు పడిస్తే చివరికి చేతికి వచ్చే సమయానికి పంటలు వర్షం పాలయ్యాయని రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షార్పణం కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోతకోసి పొలంలో ఉన్న వరి ఓదెలు నీటిలో తడిచిపోవడంతో పాటు వాగుల వెంట కొట్టుకుపోయాయి. వరి పైరు, పొగాకు మొక్కలు వర్షానికి నేలమట్టమయ్యాయి. కొండ్రముట్ల, కొచ్చెర్ల, బోడెపూడివారిపాలెం, బోడెశంభునివారిపాలెం, ఉప్పరపాలెం గ్రామాలలో కురిసిన వర్షం కర్షకులకు కన్నీరు మిగిల్చింది. వేల రూపాయలు ఖర్చు పెట్టి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షం రూపంలో నష్టం కలిగించడం అన్నదాతలు నిలువునా మునిగిపోయారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందులు, చీడపీడలను దాటి పంట చేతికి వచ్చే సమయంలో వర్షం వలన దెబ్బతినడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

ఓదెలు నీటిలో కొట్టుకుపోయాయి: షేక్ సిలార్

పంట కోతకోసి ఉండడంతో ఓదెలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. ఉన్న ఎకరంలో పంట నీటిలో కొట్టుకుపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. అప్పు చేసి వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వమే ఆదుకోవాలి.

అంతా నేలమట్టమైంది : శ్రీనివాసరెడ్డి

వర్షం దెబ్బకు పొగాకు మొక్కలన్నీ నేలవాలాయి. బాగా ఆకులు వచ్చి కొట్టే సమయంలో వర్షంతో పూర్తిగా నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

'పేట'లో నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం


నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1400 నూతన ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి తెచ్చిందని, త్వరలో మరో 2వేల బస్సులు రానున్నాయని స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి ఆదివారం అన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి విజయవాడ, హైదరాబాద్ (మియాపూర్) వెళ్లే నూతన బస్సు సర్వీసులను జనసేన నాయకులు తోట రాజారమేష్‌తో కలిసి ప్రారంభించారు. బస్టాండ్‌లోని ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ సేవలపై ఆరా తీశారు. బస్టాండ్ పరిసరాలతో పాటు క్యాంటీన్, షాపులను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతపై వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రత ఎలా ఉందని డిపో సిబ్బందిని ప్రశ్నించి, స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. కొత్త బస్ సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేసిందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంతృప్తి, సంతోషమే లక్ష్యంగా పనిచేస్తూ, గాడి తప్పిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజలతో మంచి ప్రభుత్వం అనిపించుకుందని, రెట్టింపు ఉత్సాహంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో భయంభయంగా బ్రతికిన ప్రజలు, ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు షేక్ కరిముల్ల, జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయి బాబు, డీఎం ఎస్ రాంబాబు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యేలు పుల్లారావు, అరవింద బాబు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలి

నాదెండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మండలంలోని సాతులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్, సైకిల్ స్టాండ్‌లను ప్రారంభించారు. అదేవిధంగా చంద్ర స్పెషాలిటీ వైద్యశాల వారు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుతో కలసి ప్రారంభించారు. అనంతరం సాతులూరు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయటం హర్షణీయమన్నారు. ఉన్నత పాఠశాలలో చదివిన డాక్టర్ అరవింద బాబు, న్యాయవాది నర్ర శ్రీనివాసరావు, గడ్డం బిక్షారావు తదితరులు ఉన్నత స్థాయికి ఎదగటం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన సుమారు నాలుగు వందల మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముసుగు శోభారాణి, డాక్టర్ నలబోతు శరత్‌చంద్ర, బీ సత్యనారాయణ, న్యాయవాది నర్ర శ్రీనివాసరావు, సాంబశివరావు, మధుసూదనరావు, జంపని వసంతరావు, లక్ష్మీనారాయణ, రామ కోటేశ్వరరావు, ఐనవోలు రాధా, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, కమ్మ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సభ్యులను సన్మానిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

● 75 సంవత్సరాలు నిండిన 35 మంది సభ్యులకు సత్కారం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలు ఆదివారం పట్టణంలోని సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణచేసి 75 సంవత్సరాలు నిండిన 35 మంది సభ్యులను సన్మానించారు. ప్రతి ఒక్కరికి శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రంగనాయకులు, సెక్రటరీ సీసీ ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్కే ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు కంచుపర్తి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, ఈశ్వర్‌రెడ్డి, పూనాటి సుబ్బారావు, అంబటి మాధవరెడ్డి, సైదులు, మూర్తి, రాజేశ్వరరావు, రంగోజీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం ప్రభుత్వ పాఠశాల్లో గణిత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభను చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శైలజ, యలమందరావు, లక్ష్మి, శిరీషా, అంకారావు, శ్రీనివాసరావు, పద్మ, అనూషా, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీచేస్తున్న యంగ్‌స్టార్ హెల్పింగ్ హర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు

వినుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనాథలకు, బిక్షాటన చేసే యాచకులకు, నిరాశ్రయులకు యంగ్‌స్టార్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్‌ల తోపాటు పలు కూడళ్లలో ఆదివారం దుప్పట్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ వినుకొండలో పెరిగిన చలితో అనాథలు, యాచకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఫౌండేషన్ తరుపున సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జి.మనోహర్, పి.వెంకటరావు, ఎ.అంకారావు, సునీల్‌కుమార్, బాలరాజు, ఎ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘాల నూతన కమిటీల ప్రమాణ స్వీకారం


కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్ నూతన కమిటీలతో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీలకు అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా అనేక సమస్యలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇక ముందు అలా జరనివ్వబోమని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరం కలిసి ఆర్యవైశ్యులకు అండగా ఉంటామన్నారు. దానగుణంలో ఆర్యవైశ్యులు అందరికంటే ముందుంటారని, సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, వారు ఎంత బాగుంటే సమాజం అంత బాగుంటుందని చెప్పారు.

మ్యాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

నరసరావుపేట లీగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మ్యాక్స్ కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్ జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన ఎం.పిచ్చమ్మ (52) అనే మహిళ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. ఆమెకు వైద్య పరీక్షలు జరిగాయి. పరీక్షలలో ఆమెకు క్యాన్సర్‌గా తేలింది. దీనికితోడు గర్భసంచికి గడ్డ ఉన్నట్టు కూడా వైద్య పరీక్షల నివేదికలో ఉంది. దీంతో ఆమెకు సర్జరీ చేయాలని వైద్య బృందం నిర్ధారించి శుక్రవారం రాత్రి డాక్టర్.శివప్రదీప్, డాక్టర్ శ్వేతలు, ఇతర వైద్యులు ఆపరేషన్‌చేసి పిచ్చమ్మ గర్భ సంచికి ఉన్న 6 కేజీల గడ్డను తొలగించారు. మిగిలిన ఆరోగ్య పరిస్థితి వివరాల నిర్ధారణ కోసం బయాప్సీలు ఐదు రకాలుగా తీసి పరీక్షలకు పంపినట్టు డాక్టర్ శివప్రదీప్ మీడియాకు వివరించారు. ప్రస్తుతం పేషంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

డాక్టర్ జున్నుసాహెబ్‌కు గురుపురస్కార్ అవార్డు


ఉపాధ్యాయుడు డాక్టర్ జున్నుసాహెబ్‌ను ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురుపురస్కార్ అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

యడ్లపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్‌కు ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురుపురస్కార్ అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన సిబిన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గుంటూరు సుగుణ సైన్స్ అకాడమీ, నెల్లూరు సింహపురి ఖగోళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్టు ఏపీజే అబ్దుల్ కలాం పేరిట ఏటా అవార్డులను ప్రదానం చేస్తోంది. 14వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది విద్యార్థులు, ఉపాధ్యాయులకు కాలీగ్రఫీలో ఉచిత శిక్షణ అందించడంతోపాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు జున్నుసాహెబ్‌ను ఈ అవార్డుతో సత్కరించారు. అవార్డు ప్రదానోత్సవంలో ట్రస్టు అధ్యక్షుడు ఏవీఎస్‌ఎస్ ప్రసాద్, ఇస్రో ఆర్‌ఎస్ఏపీ హెడ్ డాక్టర్ కె రామమోహనరావు, కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా సైన్స్ అధికారి సిద్దాబత్తిని రాజశేఖర్, సిబిన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, హిందూ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.


వైద్య సలహాలు, సూచనలు ఇస్తున్న డాక్టర్ నవ్యశ్రీ

230 మందికి షుగర్, బీపీ వైద్య పరీక్షలు

యడ్లపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో షుగర్, బీపీ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ శొంఠినేని నవ్యశ్రీ, ఫార్మసిస్ట్ రావూరి సౌమ్యలు హాజరై వైద్య సేవలు అందించారు. శిబిరానికి హాజరైన 230మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. షుగర్, బీపీతో బాధపడుతున్న వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డాక్టర్ నవ్యశ్రీ వివరించారు. కార్యక్రమాలను బాసట సభ్యులు నూతలపాటి కాళిదాసు, సామినేని వెంకటేశ్వర్లు, ముత్తవరపు రవీంద్రబాబు, సాగి వెంకటార్జున్, కేతా రాంబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, ముత్తవరపు విజయ్‌కుమార్, వేణుగోపాల్, రావూరి సుమన్, కోయ రామోజీరావు, ఎం సాయి, రావూరి సురేష్ తదితరులు పర్యవేక్షించారు. స్వచ్ఛందంగా సేవలందించిన వలంటీర్లకు వైద్య సిబ్బందికి అధ్యాపకులు రావూరి దేవయ్య భోజన ఏర్పాట్లు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

అందరూ ఐక్యంగా గెలిపించాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజాలు ఐక్యంగా తనను గెలిపించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా సన్నాహక సమావేశం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో నిరంతరం పోరాడుతున్నానన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీ కృష్ణయ్య, ఎం మోహనరావు, యూటీఎఫ్ నాయకులు కే శ్రీనివాసరెడ్డి, పీ ప్రేమ్‌కుమార్, ఎస్ ఆంజనేయనాయక్, ఏ భాగేశ్వరి, జీ విజయకుమార్, కౌలు రైతు సంఘం నాయకుడు వై రాధాకృష్ణ, ఏ గోపాలరావు, ఏ లక్ష్మీశ్వరరెడ్డి, జీ రవిబాబు, కట్టా కోటేశ్వరరావు, కే సాయికుమార్, టీ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


వేద స్కూల్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న చిత్రం

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చిలకలూరిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేద స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీస్తు జన్మించిన వృత్తాంతాన్ని చక్కగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రీగిరి పేర్సీ స్వరూప క్రిస్మస్ కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇతరుల కష్టాలను పంచుకోవడమే కాక వారి అభివృద్ధిని కాంక్షించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సత్య దీప్తి, ప్రిన్సిపాల్ సునీత, ఆపరేషన్ డైరెక్టర్ జోసఫ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మీ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ...

నాదెండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల గ్రామంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఎల్‌సీ ఫాస్టర్ బీ మోహన్‌రావు కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.